క్లుప్తంగా

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమం సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆర్డీఓ మొవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు. వాటిని గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్టీటీపీఎస్ కాలుష్య నివారణపై ఆందోళన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న బూడిద, వాయు కాలుష్యాన్ని నివారించాలని ప్రజా పరిరక్షణ సమితి సభ్యులు ఆదివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రామిక నగర్ వద్ద ఎన్టీటీపీఎస్ గేటు ముందు ప్లకార్డులు పట్టుకుని కాలుష్యాన్ని నివారించాలని నినాదాలు చేశారు. రోడ్డుపై పేరుకుపోయిన బూడిదను చీపుర్లతో ఊడ్చి గేటులో నుంచి విసిరి తమ నిరసన తెలిపారు. బూడిద చేతులతో అల్పాహారం తీసుకుని బూడిదతో కలిసిన ఆహారం, గాలి మా ఆరోగ్యాలను గుల్ల చేస్తోందని ఆరోపించారు. కాలుష్యం నివారణకు చర్యలు తీసుకుంటామని గతంలో ప్రకటించిన అధికారులు హామీని విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమితి నాయకులు అక్కల గాంధీ, రైతు సంఘాల సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విస్సన్నపేట: డీఎస్సీ అభ్యర్థుల కోసం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తయారు చేయించిన సైకాలజీ స్టడీ మెటీరియల్‌ను స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. డీఎస్సీకి సిద్ధం అవుతున్న వారికి స్టడీ మెటీరియల్ అందించామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ తెలిపారు. స్టడీ మెటీరియల్ కావాల్సిన వారు యూటీఎఫ్ మండల నాయకులను సంప్రదించాలన్నారు. యూటీఎఫ్ నాయకులు పి. రామకృష్ణారెడ్డి, కె. చైతన్య, గౌరవాధ్యక్షుడు బీవీ రామారావు, చంటిబాబు, రంగా, రాంబాబు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల ఏర్పాటు



ఆగిరిపల్లి: మండలంలోని ఈదరలో గ్రామస్తుల కోసం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దన్నపనేని పెద్ద సత్యంబాబు ఆయా ప్రదేశాల్లో 10 సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దన్నపనేని వేణు, గోళ్ల ఇస్సాకు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలపై సంతకాల సేకరణ

తిరువూరు: స్థానిక సాయిరాఘవ కాలనీలో నెలకొన్న రోడ్లు, మంచినీరు, వీధికుక్కల సంచారం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. కాలనీలో ఇళ్లకు పురపాలక శాఖ అనుమతులు ఉన్నాయని, ఆ మేరకు ప్రభుత్వానికి పన్నులు కడుతున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఎం. రాంప్రదీప్, వెల్లంకి ఉదయ్, కర్ని నర్సయ్య, కుప్పాల గణేష్ కుమార్, దేవిశెట్టి మహేష్, షేక్ బాజీ పాల్గొన్నారు.

కట్టెలేరుకు పెరిగిన వరద



తిరువూరు: గంపలగూడెం మండలంలోని వినగడప కట్టెలేరు వాగుపై వరదనీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షాల కారణంగా తోటమూల–వినగడప మధ్య ఉన్న వంతెనపై వరద నీరు పోటెత్తింది. దీంతో సమీప 20 గ్రామాలకు రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు.

ఇసుక తోడేళ్లు

- నది పరీవాహక గ్రామాల్లో ఇసుక తవ్వకాలు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పొలాల్లో ఇంకుతున్న భూగర్భ జలాలు



చినలంక గ్రామంలో వ్యవసాయ పొలాలకు సమీపంలో ఇసుక లోడింగ్ చేసుకుంటున్న ట్రాక్టర్ (ఇన్‌సెట్) పెదలంక గ్రామంలో నది పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక లోడింగ్‌తో వెళుతున్న ట్రాక్టర్లు

ఇబ్రహీంపట్నం: ఉచిత ఇసుక మాటున పంట పొలాల సమీపంలో నది పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. మండల పరిధి కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని ఏ గ్రామంలో చూసినా రాత్రీపగలు తేడా లేకుండా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తవ్వకాలకు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఏకమై రేవులు పంచుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక రవాణాలో కూటమి నేతల మధ్య వర్గ విభేదాలు బయటపడుతున్నాయి. దాములూరు, కొటికలపూడి, జూపూడి, గుంటుపల్లి, మూలపాడు, చినలంక, పెదలంక గ్రామాల్లో వ్యవసాయ భూముల సమీపంలో అక్రమ ఇసుక రవాణాలో వాటాలు కావాలని పట్టుబడుతున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో వాల్టా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. నీరు, భూమి, వృక్ష సంరక్షణకు ఈ చట్టం ఉపయోగపడుతుంది. చట్టాన్ని ఉల్లంఘించి ఇసుక రవాణా కోసం అడ్డొచ్చిన చెట్లను నరికేస్తున్నారు. జేసీబీలతో ఇసుక తవ్వడం వలన నదీ తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మండలంలోని జూపూడి, మూలపాడు, కొటికలపూడి, దాములూరు, చినలంక, పెదలంక గ్రామాల్లోని ఇసుక రేవులు అన్నీ నది పరీవాహక ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోనే సుమారు 8 వేల ఎకరాల వరకు వ్యవసాయ లంక భూముల్లో రైతులు వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. జేసీబీలతో ఇసుక తవ్వుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు పనికిరాకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జూపూడి రేవును గతంలో నిలిపివేసిన హైకోర్టు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో నిర్వహించిన ఇసుక వేలం పాటలో జూపూడి, లంక గ్రామాల మధ్య ఉన్న ఇసుక రేవును ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. వ్యవసాయ భూముల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. నది పరీవాహక ప్రాంతానికి వ్యవసాయ భూములకు మధ్య కనీసం 500 మీటర్ల దూరం లేని ఇసుక క్వారీల్లో తవ్వకాలు నిలిపి వేయాలని అప్పట్లో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు జూపూడి ఇసుక రేవుకు వేలం నిర్వహించలేదు.

డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

కృష్ణానది ఒడ్డు గ్రామాలైన ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి రేవుల్లో రాత్రి వేళల్లో నదీ గర్భం నుంచి డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుక తోడి లారీల ద్వారా పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక్కడ 2014–19 మధ్య కాలంలో పడవల ద్వారా నదీ గర్భం నుంచి ఇసుక తవ్వకాలు జరిపిన వారే ఇప్పుడు కూడా అక్రమ మార్గాన ప్రకృతి వనరులను దోపిడీ చేస్తున్నారని ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. ఈతతంగంలో పాత టీడీపీ వర్గానిదే పైచేయిగా ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. కూటమి నాయకులు దాములూరు ఇసుక రేవు నుంచి కూడా రాత్రి వేళల్లో ఇసుక లోడింగ్ చేయించిన లారీలు హైదరాబాద్‌కు తరలించి భారీగా కాసులు వెనకేసుకుంటున్నారు.

ఇసుక తవ్వకాలకు అనుమతిలేదు



మండల పరిధిలోని ఇసుక క్వారీల్లో ఇసుక తవ్వకాలు, రవాణాకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టుబడిన వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయిస్తాం. నది పరీవాహక గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తాం.

– వై.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

పొలాలు, రోడ్లు ధ్వంసం అవుతున్నాయి



పెదలంక, చినలంక గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. నది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. వ్యవసాయ బోర్లు పనిచేయవని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఇసుక తవ్వకాలను నియంత్రించాలి.

– నెమలకంటి శేషయ్య, రైతు, పెదలంక

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సోమవారం ఉదయం 10.15 గంటలకు ప్రారంభిస్తారు. అనంతరం మైలవరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు యూనీఫాం అందజేస్తారు. మైలవరం పట్టణంలోని నైమిశ ఫిజియో థెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. కీర్తిరాయునిగూడెంలో ముందడుగు కార్యక్రమంలో భాగంగా ఆర్ అండ్ బీ రహదారుల మరమ్మతు పనులను ప్రారంభిస్తారని ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ప్రారంభించాలి

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేత నరసింహారావు

ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం సీఐటీయూ కార్యాలయంలో సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రకటించిందని చెప్పారు. ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. జిల్లాలో 1.50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వారందరికీ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు, వ్యక్తిగత రుణాలు అమలు చేయాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

- ఏసీపీ ప్రసాదరావు హెచ్చరిక
- కోడికత్తులు తయారుచేసే 17 మంది అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ ప్రసాదరావు, పాల్గొన్న సీఐ, ఎస్‌ఐలు

మైలవరం: రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మైలవరం ఏసీపీ వై. ప్రసాదరావు హెచ్చరించారు. మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైలవరం, తిరువూరు సీఐలు దాడి చంద్రశేఖర్, కె.గిరిబాబు నేతృత్వంలో మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలోని తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో కోడి పందేలకు అవసరమయ్యే కోడి కత్తులు తయారు చేసే స్థావరాలపై ఆరు ప్రత్యేక బృందాలు దాడులు చేసి 17 మందిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వారి నుంచి 1,120 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని 16 కేసులు నమోదు చేశామన్నారు. తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి మొత్తం 24 కత్తులు, 2 తయారు చేసే యంత్రాలను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. విస్సన్నపేట మండలంలో 4 ఏరియాల్లో సోదాలు నిర్వహించి మొత్తం 200 కత్తులు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎ. కొండూరు పరిధిలో ఐదు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించి మొత్తం 240 కత్తులు సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. జి.కొండూరు మండలంలో 15 ఏరియాల్లో సోదాలు నిర్వహించి 6 ప్రదేశాల్లో మొత్తం 335 కత్తులు సీజ్ చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేశామని చెప్పారు. రెడ్డిగూడెం మండలంలో 32 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించి 320 కత్తులు సీజ్ చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఈ సోదాల్లో చొరవ చూపిన మైలవరం ఏసీపీ వై. ప్రసాదరావు, సీఐలు డి. చంద్రశేఖర్, కె.గిరిబాబు, తిరువూరు ఎస్‌ఐ కేవీజీవీ సత్యనారాయణ, విస్సన్నపేట ఎస్‌ఐ జి. రామకృష్ణ, ఎ. కొండూరు ఎస్‌ఐ సీహెచ్ కృష్ణ, జి. కొండూరు ఎస్‌ఐ కె. సతీష్‌కుమార్, రెడ్డిగూడెం ఎస్‌ఐ బి. మోహనరావులను విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు అభినందించారు.

చిట్టడవిలా వేంపాడు మేజర్ కాలువ



ఆరుగొలను పేట వద్ద పిచ్చి చెట్లతో నిండిన వేంపాడు మేజర్ కాలువ

చాట్రాయి: వ్యవసాయ భూములకు సాగు నీరందించే వేంపాడు మేజర్ కాలువ తుప్పలతో చిట్టడివిని తలపిస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కలగర రామచంద్రాపురం ఎస్ఎస్‌పీ కెనాల్ రెగ్యులేటర్ నుంచి మండలంలోని చాట్రాయి పెద్ద చెరువు, దీప చెరువు, నీలాద్రి చెరువు, తుమ్మగూడెం పెద్ద చెరువు, సోమవరం పెద్ద చెరువుతో పాటు ముసునూరు, బాపులపాడు మండలాల చివరి ఆయకట్టు పెదవేగి మండలం వేంపాడు వరకు ఉన్న సుమారు 32 వేల ఎకరాలకు సాగు నీరందిస్తోంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న వేంపాడు మేజర్ కాలువ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఈ కాలువ ద్వారా సాగర్ జలాలు పై ప్రాంతాలకు పంపిణీ అయ్యేవి. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇటు సాగర్ జలాలు పంపిణీ కాక చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి కాక ఈ కాలువ రెండింటికీ చెడ్డ రేవడిలా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నరసింహారావుపాలెం వద్ద డైవర్షన్ ద్వారా ముసునూరు, వేంపాడు వరకు చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు పంపిణీ చేయాల్సి ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయంతో సాగర్ జలాలు విడుదల చేస్తే తుప్పలతో ఉన్న వేంపాడు మేజర్‌కు సాగర్ జలాలు పంపిణీ చేయాలంటే ఆటంకాలు ఏర్పడవచ్చునని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా వేంపాడు మేజర్‌కు మరమ్మతులు చేపట్టి, సాగర్ జలాలు పంపిణీ చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సీపీఎం తిరువూరు పట్టణ మహాసభ



మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

తిరువూరు: బీజేపీ నుంచి దేశానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు అన్నారు. సీపీఎం తిరువూరు పట్టణ మహాసభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పి. తులసీరాణి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశానికి బీజేపీ నుంచి వచ్చే ప్రమాదాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించడం లేదన్నారు. సీపీఎం దానిని గుర్తించిందని చెప్పారు. బీజేపీ ప్రమాదకరమని కాంగ్రెస్ భావించి ఉంటే మూడోసారి కేంద్రంలో బీజేపీ వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను కలుపుకుని వెళ్లడంలో కాంగ్రెస్ విఫలం అవుతోందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, శ్రీనివాసరావు, మేకల నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

విస్సన్నపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక వెలుగు కార్యాలయం మీటింగ్‌హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు ఆదివారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

రేషన్ బియ్యం అక్రమ దందాలో టీడీపీ నేత

సామాజిక మాధ్యమాల్లో వాయిస్ రికార్డు వైరల్

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద, ఇసుక అక్రమ తరలింపులో చక్రం తిప్పుతున్న టీడీపీ నేతలు ఇప్పుడు ప్రభుత్వ రేషన్ బియ్యం సేకరించి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నారు. మూలపాడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ప్రస్తుత టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకి నాగరాజు రేషన్ బియ్యం నేనే కొంటాను.. ఎవరికీ అమ్మవద్దంటూ మాట్లాడిన ఓ వాయిస్ రికార్డు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడం చర్చనీయాంశంగా మారింది. మండలం మొత్తం నేనే రేషన్ బియ్యం పట్టాలి. ఎవరికీ ఇవ్వద్దు అంటూ హుకుం జారీ చేసినట్లు నాగరాజు మాట్లాడిన ఆడియో వైరల్‌గా మారింది. ఇప్పటికే సీఐ, తహసీల్దార్‌తో మాట్లాడుకున్నానంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు రేషన్ బియ్యం దందాలో రంగప్రవేశం చేయడం, మండల రెవెన్యూ అధికారి, సీఐ పేర్లు ప్రస్తావించడం చర్చనీయాంశమైంది.

నిధులు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- వినియోగంలోకి తీసుకురావాలని వినతి



తాతకుంట్లలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

విస్సన్నపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చెత్త సంపద తయారీ కేంద్రం షెడ్లు నిర్మాణం చేసి ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని పరిస్థితి. చెత్త నుంచి సంపద తయారీ షెడ్లను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు రూ.4,24,901 చొప్పున 2018లో 11 గ్రామ పంచాయతీలలోను, నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ లంబాడీతండాలో 2022లో షెడ్లు నిర్మించారు. చెత్తను వేరు చేసేందుకు అవసరమైన మిషనరీ ఏర్పాటు చేశారు. చెత్తను సేకరించి షెడ్లకు చేర్చి అక్కడ తడి చెత్తను నిల్వ ఉంచి దాని నుంచి వర్మీకంపోస్టు ఎరువులు తయారీ చేసే ప్రక్రియ మండలంలో చాలా గ్రామాల్లో జరగడంలేదు. మిషనరీ తుప్పుపట్టే పరిస్థితి నెలకొంది. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి వ్యర్థాల నుంచి ప్రజల ఆరోగ్యం కాపాడటంతో పాటు వర్మీ కంపోస్టు ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచించామని అధికారులు తెలిపారు.

వినియోగంలోకి తెస్తాం



గ్రామ పంచాయతీల 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి కొంత మేరకు వీటికి వినియోగించాలని సూచించాం. త్వరలో అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తాం

–చేకు చిన్నరాట్నాలు, ఎంపీడీఓ, విస్సన్నపేట

వర్మీ కంపోస్టు తయారుచేస్తాం

చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో చెత్తను సేకరించే కార్యక్రమం చేస్తున్నాం. కొంత డంపింగ్ యార్డుకు తరలించినా తడి చెత్తను మాత్రం చెత్త నుంచి సంపద తయారీ షెడ్లలో నిల్వ చేస్తున్నాం. త్వరలో వానపాములు వేసి వర్మీకంపోస్టు తయారీ చేస్తాం.

– హరికృష్ణ కుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ, పంచాయతీ ఈఓ విస్సన్నపేట

కోడిపందేల శిబిరంపై దాడి

తిరువూరు: మండలంలోని చింతలపాడు గ్రామ శివారులో ఆదివారం తిరువూరు ఎస్‌ఐ–2 వి. వెంకటరావు సిబ్బంది కోడి పందేల శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కోడి, ఒక కోడి కత్తి, రూ.7,810 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పార్థసారథి



సూరంపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చాట్రాయి, చనుబండ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో మంజూరైన సీసీ రోడ్లకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం దారుణం

నూజివీడు: ప్రజలను సంక్షేమం పేరిట కూటమి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టివేస్తోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్ కుమార్ విమర్శించారు. నూజివీడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపం–2 పథకంలో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం ద్వారా కూటమి ప్రభుత్వంపై రూ.2,685 కోట్ల భారం పడుతోందన్నారు. అయితే ప్రభుత్వం మరో వైపు సంక్షేమం మాటున విద్యుత్ చార్జీలు పెంచడం వలన ప్రజలపై రూ.6 వేల కోట్లకు పైగా భారం మోపిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాక ముందే తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచేది లేదని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు పెంచారని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. సంక్షేమం పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్న విషయం అందరూ గమనిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో కూటమి పాలకులకు అన్నివర్గాల ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట



నూజివీడు: పట్టణంలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన తోలుబొమ్మలాట జానపద కళారూపానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నూజివీడు కళావేదిక నేతృత్వంలో సిద్ధార్థ జూనియర్ కళాశాల వద్ద కాకినాడకు చెందిన శ్రీసాయి నిలయ తోలుబొమ్మలాట గ్రూపు వారిచే సుందరాకాండ ఘట్టాన్ని తోలుబొమ్మలాటతో ప్రదర్శించారు. 40 ఏళ్ల తరువాత తోలుబొమ్మలాటను ప్రదర్శించడంతో స్థానికులు తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ప్రేక్షకులకు సినిమా పరిచయం లేని రోజుల్లో ఒక వెలుగు వెలిగిన తోలుబొమ్మలాట ప్రస్తుత డిజిటల్ యుగంలో కనుమరుగైపోయిన నేపథ్యంలో నూజివీడులో నిర్వహించిన ప్రదర్శనకు ఆదరణ లభించడం గమనార్హం. కార్యక్రమంలో నూజివీడు కళావేదిక నిర్వాహకులు పురాణం కృష్ణ ప్రసాద్, రంగారావు, తిరుపతిరావు, సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెడునడత కలిగిన వారికి కౌన్సెలింగ్



తిరువూరు: తిరువూరు మండలంలో చెడు నడత కలిగిన వారికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎటువంటి గొడవలు, అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు.

నిందితులపై కేసు నమోదు

ఆగిరిపల్లి: ఈదర గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శుభశేఖర్ తెలిపారు. ఆదివారం ఈదరలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.